# ఎదురు చూస్తున్న ముహూర్తం

శాంత ఎప్పుడూ దేనికోసమో ఎదురు చూస్తూంటుంది. తక్కిన జనాభా కంటె తానొక ప్రైతరహాకి చెందిన వ్యక్తినని ఆమె గట్టి నమ్మకం. తను చాలా అందగత్తెననీ ఆమె అభిప్రాయం. కాని, ఆ విషయాన్ని నలుగురికి తెలియజెప్పాలనే కుతుహలం లేకపోవడమే ఆమెలో గొప్పతనం. నిజానికి ఆమె పెద్ద అందకత్తె కాదు. నుదురు కొంచెం ఎత్తు. కళ్ళలో ఆమెలోని ఆవేగం ప్రతిఫలిస్తుంది కాని, ప్రశాంతమయిన, సహజమయిన తళుకు లేదు. ముక్కు, నోరు మట్టుకు అందమయినవి. పెదవులు, ముఖ్యంగా ఇంకా విప్పుకోని గులాబి మొగ్గల్లా చిన్నగా ముద్దుగా ఉంటాయి. కాని ఆమె వైపు నలుగురూ చూస్తారు. ఆమె అనుకోకుండానే ఆకర్షిస్తుంది.

కుటుంబంలోకి ఆఖరు పిల్ల కావడంచేత అల్లారు ముద్దుగా పెరిగింది. అలా పెరిగినందువల్ల సహజంగా అబ్బే లక్షణాలన్నీ శాంతకు ఉన్నాయి. ఆమెకు ఎవరూ ఎదురు చెప్పకూడదు. ఆమెకు కోపం వచ్చినట్టయితే అందరూ భయపడాలి. ఆమెకు దుఃఖం వస్తే నలుగురూ ఓదార్చాలి. కాని ఈ లక్షణాలు ఎక్కడ బయట పెట్టకూడదో ఆమెకు స్వభావ సిద్ధంగా తెలుసు. పైవాళ్ళు అంత మర్యాదయిన పిల్లలేదనుకుంటారు. గారం వల్ల తల్లిదండ్రులకు ఈ లక్షణాలు కనబడవు. శాంతకయినా ఇలాంటి లక్షణాలు తనకున్నాయని స్పష్టంగా తెలియదు.

తన జీవితాన్నంతనీ తారుమారు చేసే సంఘటన ఎప్పుడో ఎలాగో ఏదో వస్తుందని, అది అతిలోకమయిన అనుభవం అవుతుందనీ ఆమెకు గట్టి నమ్మకం ఆ సంఘటన కోసం ఆమె నిత్యము నిరీక్షిస్తూఉండేది.

ఆమె కాలేజిలో ప్రవేశించిన తరువాత ప్రతి వ్యక్తిలోను, ప్రతి సందర్భంలోనూ ఈ సంఘటన కోసం వెతుక్కోవడం ప్రారంభించింది.

తోటి విద్యార్థులలో చాలామందిని, ఆమె రహస్యంగా పరీక్షిస్తుండేది. కాని వారు ఏ మాత్రం చేరువగా రావడానికి ప్రయత్నించినా ఆమె దూరంగా పోతుండేది. ఆమె దూరంగా పోయినకొద్దీ ఆమెను వెంటాడిన విద్యార్థి ఎవడూ లేకపోయాడు. కాని ఆమె వేదిక మీదికి ఎక్కి ఉపన్యాసాలివ్వడం అలవాటు చేసుకుంది. వక్తృత్వపు పోటీలలో కాలేజీకి కీర్తి గడించింది. ఆ సందర్భాలలో నలుగురయిదుగురు వ్యక్తులతో ఆమెకు దగ్గిర పరిచయం ఏర్పడింది. కాని వాళ్ళ అభిరుచులు ఆమెకు వెగటు గొలిపేవి. అంచేత వాళ్ళ దగ్గర మరీ జాగ్రత్తగా వ్రవర్తించేది. ఆమెతో చనువుగా మాట్లాడే వ్యక్తులు ఆమెకు నచ్చినవారుకారు. ఎవరియందు ఆమెకు కుతూహలం కలుగుతుందో వారు దూరంగా అందకుండా వుండిపోయేవారు.

ఒకసారి నిజంగా ఆమె ఆ ముహూర్తం వచ్చిందనుకుంది. ఆమె ఒకనాడు డీసెల్ కారులో ప్రయాణం చేస్తుండగా, తన ప్రక్కన నిలబడి ప్రయాణం చేస్తున్న ఒక వ్యక్తి అదేపనిగా తనవేపు చూడడం ఆమె చూసింది. కొంతసేపయిన తర్వాత అతను "ఎక్కడికి వెళుతున్నా"రని ప్రశ్నించాడు. ఆమె సమాధానం చెప్పింది. దిగిన తరువాత అతను కూడా వచ్చి వాళ్ళ యింటి దగ్గర దిగబెట్టాడు. సంభాషణలో ఏమీ అసభ్యమయిన సూచనకూడా లేకుండా చాలా మర్యాదగా, హుందాగా ప్రవర్తించాడు. మనిషి చాలా లోతయనవాడిలాగ కనిపించాడు. ఆ రాత్రి అతడు పదేపదే ఆమెకు కలలో జ్ఞాపకం వచ్చాడు. మరునాడు ఉదయం ఏదో జరగబోతుందనే ఆందోళన మనస్సులో ఆవరించింది. కాని ఆనాటి మధ్యాహ్నమే ఆమెకు అతను వ్రాసిన ఒక చీటీ వచ్చింది. చమ్మరకపు ప్రణయలేఖ. ఆమె ఆశలన్నీ నిరాశలయిపోయాయి. నలుగురయిదుగురు తోటి విద్యార్థులు ఆమెకు ప్రణయ లేఖలు వ్రాశారు. అవి ఆమెకు అసహ్యంగా అనిపించాయి. వాటిని ఆమె బయట పెట్టలేదు. వాటికి సమాధానాలు వ్రాయనూలేదు.

కాలేజీ చదలిపెట్టేదాకా ఆమె ఆ ముహూర్తం కోసం ఎదురు చూస్తూనే వుంది కాని ఆ ముహూర్తం మాత్రం రాలేదు.

## 2

మామూలుగా సంపన్న గృహస్థు ఇంట్లో పెళ్ళి ఎట్లా జరుగుతుందో అల్లాగే శాంత పెళ్ళి జరిగిపోయింది. కుర్రవాడు వైద్య పరీక్షకు చదువు తున్నాడు. నలుగురు అన్నదమ్ములలో రెండోవాడు. తెలివయినవాడని నలుగురూ అన్నారు. కట్నం పది వేలరూపాయలు. పెళ్ళి ఐదు రోజులు. వరుని పేరు లక్ష్మీకాంతరావు.

పెళ్ళి కొడుకుని పెళ్ళి అయిపోయేదాకా శాంత పరీక్షగా చూస్తూ ఉంది. ఆడవాళ్ళంతా అది చూసి ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. పెళ్ళి కొడుకు చిరునవ్వు నవ్వినప్పుడు ఆమె నవ్వలేదు. అలాగే చూస్తూ కూర్చుంది. పెళ్ళి పీటలమీద కూర్చున్నప్పుడు పెళ్ళికొడుకు తమ్ముడొకడు తరచు వచ్చి పెళ్ళి కొడుకుని పలకరిస్తూండేవాడు. ఆ గొంతు చాలా చిత్రంగా ధ్వనించేది. దూరాన్నుంచి మాట్లాడుతున్నా ఇట్టే ఆనవాలు కట్టొచ్చు. అతన్ని వెంకటం అని అందరూ పిలుస్తారు. బహుశా వెంకటేశ్వరారావయి ఉంటుంది పేరు. అతను చటుక్కున పగలబడి నవ్వుతుంటాడు. చిత్రవిచిత్రంగా మాట్లాడు తుంటాడు. తన్ను ఆకర్షించడానికి అదంతా చేస్తూన్నాడని శాంత అనుమానం కాని మగ పెళ్ళివారి తాలూకు ఆడవారితోటి మగవాళ్ళతోటి అతను ఎప్పుడూ వేళాకోళాలు ఆడుతుంటాడు. వాళ్ళందరూ అతని చుట్టూ చేరుతుంటారు కూడాను. శాంతకు అదంతా వెగటుగా ఉండేది. అతన్ని చూస్తే ఒకరకమయిన అసహన భావం కూడా కలిగింది.

కాని వివాహంలో ఆ ముహూర్తం కోసం ఆమె ఎదురు చూడలేదు. తన భర్త వట్టి మగవాడని ఆమె ముందే నిశ్చయించుకుంది. అయినా

పెళ్ళయి కాపరానికి వెళ్ళిన తరువాత కూడా ఆమె ఆ ముహూర్తం కోసం ఎదురు చూడ్డం మానలేదు.

భర్త ఆఖరు సంవత్సరం చదువుతుండగా ఆమె కాపురానికి వెళ్ళింది. లక్ష్మీకాంతరావు ఎప్పుడో శలవలకి వచ్చిపోతుండేవాడు. ఇంట్లో అత్తగారు, మామగారు, బావగారు, తోడికోడలూ, వంట మనిషీని. తోడికోడలు కూడా తనలాగే చిన్నది. కాని ఆమెకు నగలమీద, పిల్లల మీద మోజు ఎక్కువ ఆమె అట్టే చదువుకోలేదు. బావగారి పేరు సుబ్బారావు. ప్లీడరీ పరీక్ష పాసయి తండ్రికి ఆ వృత్తిలో సహాయపడుతున్నాడు. అత్తగారికి ఏమీ అక్కరలేదు. భోజనం అయిన తరువాత ఇరుగుపొరుగును గురించి కబుర్లు మాత్రం చెబుతుండేది. తోడికోడలూ ఆ విషయంలో అత్తగారికి తీసిపోదు. అంచేత వాళ్ళిద్దరికి ఎక్కువ స్నేహం. మామగారు విశాలమయిన మనిషి. మాటల లోను, చేతలలోను కూడా శాంతకు మామగారంటే ఎక్కువ గౌరవం. బావగారు చాలా బద్ధకం మనిషి. మరుదులిద్దరూ భర్తతో పాటు శలవల్లో వచ్చి పోతుంటారు.

దీపావళికి లక్షీకాంతరావు రాలేదు. వెంకటం ఒక్కడే వచ్చాడు తన భర్త లేకుండా పుట్టింటికి వెళ్ళడం శాంతకు ఇష్టం లేకపోయింది. వెంకటం పెద్ద వదినగారితో అస్తమానం వేళాకోళాలాడుతుంటాడు. ఆమె కూడా నవ్వుతూ తిప్పుకుంటూ అతనితో కలుస్తుంది. తండ్రి దగ్గర వెంకటా నికి వున్నంత చనువు ఇంకెవ్వరికీ లేదు.

వెంకటం సాయంకాలం ఏడు గంటలవేళ చేతులు పట్టినంత బాణా సంచా, బుట్టలతో పట్టుకుని వచ్చాడు. శాంత, తోడికోడలు, దీపాలు వెలిగి స్తున్నారు. అత్తగారు అరుగు మీద కుర్చీలో కూచుని కబుర్లు చెబుతోంది. రెండో అరుగుమీద మామగారు చుట్ట కాల్చుకుంటూ పచారు చేస్తున్నాడు. బావగారు ఇంటి ఎదుట వాకిట్లో నిలబడి దీపాలు చూస్తున్నారు. వెంకటం

బాణాసంచా లోపలపెట్టి అరుగుమీదికి వచ్చి తల్లి కుర్చీ ప్రక్కన నిలబడ్డాడు ఇంతలో కుర్చీ వెనక యేదో "ఢాం" అని పేలింది. ఆవిడ కుర్చీలో ఒక్కసారి ఎగిరి కిందపడింది. కొడుకును ఉద్దేశించి కఠినంగా అంది "ఏమిట్రా వెధవా! మంచీచెడ్డ ఉండొద్దూ" అందరూ గట్టిగా నవ్వారు. వెంకటం అన్నాడు—"చూశావమ్మా! ఎలా పేలుతాయోనూ!"

"నీ మొహం! నా వీపు వెనకాలేమిటి చూడ్డం?" ఆమె కూడా చివరికి నవ్వింది. నవ్వుతూ అంది—"యేమిటి యీ కుర్రతనపు చేష్టలు?"

వెంకటం తండ్రిని ఉద్దేశించి అన్నాడు. "ఈవేళ నీచేత జువ్వలు కాల్పిస్తానయ్యా. ఒరే అన్నయ్యా. పెద్ద వదినచేత బందరు తూటాలు కాల్పించాలిరా".

"బాబోయి చస్తాను" అంది ఆమె.

"మీ చిన్న వదినచేత యేం కాల్పిస్తావురా మరీ?" అంది తల్లి.

వెంకటం కొంచెంసేపు ఏమీ అనలేదు. చివరికి అన్నాడు. "ఆవిడ యిష్టం. అసలయిని నాకు చదువుకున్న ఆడవాళ్లంటే అమిత భయం".

అందరూ నవ్వారు. శాంత తన కోపాన్ని మనస్సులోనే అణచుకుంది.

భోజనాలు అయిన తరువాత అన్నదమ్ములిద్దరూ బాణసంచా పట్టుకొని ఊళ్ళోకి పోయారు. అత్తగారూ. మామగారూ నిద్రపోయారు. తోడికోడలు శాంత గదిలోకి వచ్చి కూర్చుంది.

"అతను కూడా వస్తే బావుండును" అంది.

"రావటానికి వీలులేకపోయిందట. అందులో ఆఖరు సంవత్సరం కూడాను" అంది శాంత.

"వెంకటం మంచి సరదా అయినవాడు".

"వెకిలితనం ఎక్కువ".

"కాదమ్మోయి! పైపై వాళ్ళ దగ్గర చాలా మర్యాదగా మసులుతాడు— మరేమోనేం, విన్నావోలేదో కానీ, కాలేజిలో ఆడపిల్లలు కొందరు అతనికి ఉత్తరాలు రాస్తుంటారట."

"నేను నమ్మను. అతనే చెప్పుకున్నాడా?"

"లేదమ్మోయి! అతనిల్లాంటివేవీ చెప్పడు. మా పిన్నతల్లి గారి మేనకోడలుంది-అంటే మా పిన్నాన్నగారి మేనకోడలన్నమాట-ఆ అమ్మాయి చెప్పింది. కాలేజిలో చదువుతోంది. ఇంకో అమ్మాయుందట. ఇతనంటే పడిచచ్చిపోతుందిట. కిరస్తానీలుట. ఇతనికి రెండేసి రోజులకి ఒక్కొక్క ఉత్తరం రాస్తుంటుందిట. ఏమమ్మోయి! నిజమేమిటో దేవుడికి తెలియాలిగాని ఆ అమ్మాయికి ఇతనికీ సంబంధం ఉందని చెప్పింది ఆ పిల్ల. కాని చాలా సరదా అయినవాడు, యెంతో బాగా కథలు రాస్తాడట. నేనెప్పుడూ చదవలేదనుకో. అన్ని పత్రికలకీ రాస్తుంటాడుట".

శాంతకు ఆ రాత్రి చాలా సేపటి వరకూ నిద్రపట్టలేదు. తోడికోడలు చెప్పిన విషయాలు ఆమె మనస్సులో చాలాసేపు తిరిగాయి. కాలేజిలో ఇట్లాంటి విషయాలు ఎల్లా జరుగుతాయి? మగపిల్లలు ఆడపిల్లలకి ఉత్తరాలు రాయగలరు గాని ఆడపిల్లలు యెల్లారాస్తారు?

వెంకటం అంటే ఆమెకు అసహ్యం మరీ యెక్కువయింది.

## 3

భర్త మద్రాసులో కాపురం పెట్టిననాటి నుంచి శాంతే యింటికి యజమానురాలయింది. లక్ష్మీకాంతరావు ఒకరకంగా సాధువు, ఒకరకంగా పెంకి. అతనికి ఎంతతోస్తే అంతే. ఇంటి విషయాలలో మట్టుకు అతను అన్నీ శాంతకు వదిలేస్తాడు. శాంతకు కోపం వచ్చినప్పుడు అతను ఆ సంగతి తను గ్రహించనట్టు ప్రవర్తిస్తాడు. అందుచేత శాంత తన కోపాన్ని అతని మీద ఆయుధంగా ప్రయోగించ లేకపోయింది. ఆడవాళ్ళకు రెండో ఆయుధం

కన్నీరు. కాని శాంత ఆ ఆయుధాన్ని ప్రయోగించలేదు. ఎంచేతో ఆమెకు ఆత్మగౌరవానికి భంగంగా కనిపిస్తుంది. కాని ఆమెకు ఏడవాలనిపించిన ముహూర్తాలు లేకపోలేదు.

ఆమె కాపురం సుఖంగానే గడిచిపోతూంది. క్రమంగా ఆమెకు భర్త యెడల గౌరవం ఏర్పడింది. కాని ఆమెలో ఏదో తీరని వ్యధ ఉంది. ఆమె జీవితం ఇట్లా గడిచిపోతుందని ఆమె ఎన్నడూ అనుకోలేదు. కాని ఎలాగ జీవితం మారితే తనకు బాగుంటుందో ఆమెకు స్పష్టంగా తెలియదు.

ఒకనాడు లక్ష్మీకాంతం హాస్పిటల్ నుంచి ఇంటికి వస్తూ చేతిలో ఒక కాగితాల కట్ట తీసుకువచ్చాడు. శాంత ఏమిటని అడిగింది.

"నీకోసం"

"ఏమిటవి?"

"మా వెంకటం కథలు"

"అక్కర్లేదు. అంతకంటె మంచి పుస్తకాలు చాలా చదివాను"

లక్ష్మీకాంతం పకపక నవ్వాడు.

"ఎందుకంత నవ్వు?"

"సరిగ్గా వాడు ఎలా రాశాడో అలాగే అన్నావు నువ్వు"

"నన్ను గురించి ఉత్తరాల్లో కూడా రాస్తున్నాడేమిటి?"

"లేదు. నేను రాసిన ఉత్తరానికి సమాధానం రాశాడంతే. చదువుతాను విను."

"నేను వినను"

కాని లక్ష్మీకాంతం చదవడం ప్రారంభించాడు. ఆమె వినకూడదనుకుంటూనే వింది.

"ఈ కథలు నీకు నచ్చవని నాకు తెలుసు. అంచేత ఇన్నాళ్ళనించీ నేను నీకు పంపలేదు. నీకు మంచి చిక్కని ప్లాటు ఉన్న అపరాధ పరిశోధక

నవలలు కావాలి. నా కథల వంటివి అసలు ఎందుకు రాస్తాకో కూడా నీకు అర్థంకాదు. అంచేత ఈ కథలు మా వదినగారి కోసమని నేను ఊహించాను. ఆవిడ నిన్ను అడిగిందా? ఆమె స్వభావాన్ని బట్టి అడిగివుండదని నేను అనుకుంటాను. నీకు తెలియకుండా రహస్యంగా సంపాదించి చదువుతుంది. వీలయితే. కాని నువ్వీ కథలు తీసుకు వెళ్ళి 'మా తమ్ముడు రాసిన కథలివ్వి చదువు' అని యిస్తే ఆమె ఏమంటుందో తెలుసా?'నేనుచదవను. ఇంతకంటే మంచి కథలు లక్ష చదివాను' అంటుంది. అయినా సరే ఇయ్యి. నిజంగా ఈ కథలు ఆమెకు నచ్చుతాయి.

"అన్నట్టు మరిచిపోయాను. నేను పెళ్లి చేసుకోకూడదని నిశ్చయించు కున్నాను. నాన్నకి కూడా రాశాను. మన పెద్దలు చెప్పినట్టు బ్రహ్మచర్యాన్ని నడపడానికి కాదుసుమా. ఆ సంగతి నీకేతెలుసు. నా బోటివాడికి పెళ్ళి అసలు సరిపడదు. ఈ విషయం వదినగారితోచెప్పి ఆమె ఏమంటుందో జవాబు రాయి."

శాంత విని లోపలికి వెళ్ళిపోతోంది. లక్ష్మీకాంతం ఆమెను కేక వేశాడు. " మరేమంటావు? "

" దేనికి? "

"నువ్వేమంటావో రాయమన్నాడుగా"

"అవసరం తీరుతుంటే పెళ్ళెందుకు?"

లక్ష్మీకాంతం విరగబడి నవ్వుతుండగా శాంత చరచున లోపలికి వెళ్ళిపోయింది.

కాని మరునాడు ఆమె భర్త వెళ్ళిపోగానే ఆ కట్ట తీసింది. ఒక కథ ప్రారంభించి చదివింది. పేరు ప్రణయ లేఖలు. కాలేజి విద్యార్థిని ఒకతె ఒక యువకుడికి ప్రణయ లేఖలు వ్రాయడం ప్రారంభిస్తుంది. ఆ కుర్రవాడు సమాధానాలు వ్రాస్తాడు. ఆమె విషయాలన్నీ భూమికి కొంత ఎత్తుని ఆకాశంలో మెదులుతుంటాయి. అతని ఉత్తరాలలో అన్నీ వాస్తవికమయిన

విషయాలే వుంటాయి. ఆమెలో దేన్ని తను ఎక్కువగా ప్రేమిస్తున్నాడో కాలేజీలో ఏ గోడ ప్రక్కన నిలబడినప్పుడు అతని హృదయం చివుక్కుమందో, ఫలానిరోజుని ఆమె మబ్బురంగు చీర, ఆకుపచ్చ జాకెట్టు తొడుక్కువచ్చినప్పుడు అతను ఏలా వెర్రివాడిలాగ చూస్తూ నిలబడ్డాడో అన్నీ విపులంగా అతను రాసేవాడు. చివరకు వాళ్ళిద్దరూ ఒకచోట కలుసుకున్నప్పుడు ఆమె ఇంక ఆకాశంలోనే ఉండిపోయింది. అతను దింపడానికి ప్రయత్నించినప్పుడు ఆమె చటుక్కుని ఏడుపు ప్రారంభించింది. అతన్ని దూషించింది. తన వెర్రితనాన్ని నిందించుకుంది. ఆమె ఉత్తరాలను అతడు తిరిగి యిచ్చివేశాడు. తన ఉత్తరాలను మాత్రం ఆమె అతి జాగ్రత్తగా పదిలంగా జాకెట్టులో దాచుకుంది.

ఆ పిల్లలో తన ఛాయలు కొన్ని ఉన్నాయని శాంతకు అనుమానం కలిగింది. కాని తను కాలేజి రోజుల్లో ఏమనుకుందో వెంకటానికేం తెలుసు? తను ఒక్క ప్రణయలేఖ కూడా ఏవరికీ రాయలేదు. కాని తను అప్పుడప్పుడు రాసుకున్న ప్రణయ లేఖలన్నీ ఆ అమ్మాయి కథలో రాసినవే. ఆమెకు అమితమయిన చిరాకు కలిగింది. క్రమంగా మనస్సుని దిగులు ఆవరించింది. లక్ష్మీకాంతం వచ్చేనరికి ఒడిలో ఆ కథల కాగితాలతో ఆమె పరధ్యానంగా కూర్చునివుంది.

"ఎలా వున్నాయి కథలు"

"ఏడిపినట్టున్నాయి. అన్నీ మగవాళ్ళూ, ఆడవాళ్ళూ ప్రేమా. అదొక్కటే లోకంలోకంతకీ ముఖ్యమయినట్టు" ఆమె కథల కట్టని మంచం మీదికి విసిరి లేచింది.

మరునాడు మళ్ళీ కట్ట తీసి ఇంకో కథ చదివింది. కథ ప్రణయాన్ని గురించినదే. అయినా పాత్రలు, అనుభవాలు, సంఘటనలూ వేరు. ప్రతి స్త్రీ పాత్రలోనూ తన ఛాయలు కొద్దిగా ఉన్నట్టు ఆమెకు అనుమానం. మొదటి కథకూ ఈ కథకూ వాతావరణంలో ఎంతో భేదం ఉంది. ఇందులో ఇద్దరు

వేశ్యలు వస్తారు. చాలా చిత్రంగా ఉంది కథ. మంచితనమూ, సహనమూ, హుందా, జీవితంలోని ఆనందమూ అంతా వాళ్ళలో మూర్తీభవించి ఉంటుంది. ఇద్దరూ ఒకే వ్యక్తిని ప్రేమిస్తారు. కాని ఇరువురి మధ్యా ఈసులేదు. ఆ ప్రేమించినవాడి భార్య పతివ్రత, భక్తురాలు కాని అతని జీవితాన్ని నరకప్రాయంగా చేసిపారేసింది. ఆమెలో క్రౌర్యమూ, అసహనమూ ప్రతిమాటలోనూ, చేతలోనూ వ్యక్తమవుతాయి.

ఇవన్నీ వెంకటానికి అనుభవమయిన విషయాలవునో కాదో తెలుసుకోవాలని ఆమెకు ఎంతో కుతూహలం మనస్సులో ఉంది. భర్తను వ్యంగ్యంగా ఆమె ప్రశ్నించింది. కాని అతనికీ అట్టే తెలియదేమో. ఒక్కొక్క కథే చదువుతున్న కొద్దీ, అతనికి ఆడవాళ్ళతో అనేక మందితో పరిచయం ఉండి తీరాలని ఆమెకు అనిపించింది. ఇలాంటి విషయాలన్నీ ఎవరయినా ఎల్లా రాయగలుగుతారు? ఇంత అవినీతికరమయిన ఘట్టాలను వర్ణించే కథలు ప్రభుత్వం ఎందుకు ఆపదు? అసలు ఇలాంటి అవినీతిని సంఘం ఎందుకు రూపుమాపదు? బలహీనులయిన స్త్రీల మనస్సులు ఇటువంటివి చదివితే తలక్రిందులయిపోవూ? భర్తతో ఆమె వాదాలన్నీ ఈ ధోరణిలో నడిచేవి.

ఒక కథలో స్త్రీపాత్ర వుంది. ఆమె ఉత్తమ ప్రేమను వాంఛిస్తుంది. ఆ ప్రేమ ఆమెకు కరగతమయ్యే పరిస్థితులలో దాన్ని అందుకోడానికి ఆమెకు సాహసం చాలదు. నలుగురయిదుగురు వ్యక్తులు-స్త్రీలు, పురుషులు, యువకులు వృద్ధులు ఆమెకు చాలా ఆప్తులయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. నిజమయిన వాస్తవికమయిన అనురాగం ఎప్పుడు ఫలోన్ముఖంగా అవుతుందో ఆ క్షణంలో ఆమె దాన్నించి తొలగిపోతుంది. చివరకి ఆమె క్రీస్తు మతం స్వీకరించి బ్రహ్మచారిణీగా అయి, నడివయస్సునించి వృద్ధాప్యం వరకూ ఒక ఆడపిల్లల బడిలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి చచ్చిపోతుంది. చివరి రోజుల్లో ఆమె కఠినంగా అయిపోతుంది. దయా, దాక్షిణ్యమూ ఎక్కడా వుండవు. యౌవనాన్ని ప్రేమనీ చూస్తే ఆమెకు ద్వేషం.

కథ మొదటి భాగం అంతా తనేనని శాంత అనుకుంది. కథ చివరి వరకూ చదివేసరికి ఆమెకు అమిత భయం వేసింది. కాని తనకూ, ఆ స్త్రీకి ఉత్తర భాగం పోలికలేదని మనస్సుని కుదుట పరుచుకుంది. అవ్యక్తమయిన భయం ఆమె హృదయాన్ని పట్టుకుని మాత్రం నీడలా ఆవరించింది.

ఆ కథ చదివిన తరువాత ఆమె భర్తతో వెంకటాన్ని గురించి చర్చించడం మానివేసింది.

వెంకటం మెయిలులో దిగాడు. అతను వస్తాడని ఎవరూ అనుకోలేదు. సామాను విప్పుకోకుండానే స్నానంచేసి లక్ష్మీకాంతం పంచీ, లాల్చీ వేసుకుని భోజనానికి రానని చెప్పి ఊళ్ళోకి వెళ్ళిపోయాడు. లక్ష్మీకాంతం మూడు గంటలవేళ ఇంటికి తిరిగి వచ్చి సాయంత్రందాకా శాంతతో ఏవో కబుర్లు చెబుతూ కూర్చుని వెలుగుండగానే భోజనం చేసి రాత్రి హాస్పిటల్‌లో ఉండవలసిన అవసరం ఉందని చెప్పి వెళ్ళిపోయాడు. ఆమె కూడా భోజనం చేసి డాబా మీద దీపాలన్నీ ఆర్పేసి కూర్చుంది. వచ్చీపోయే జన ప్రవాహం క్రమంగా తొమ్మిది గంటలయేసరికి తగ్గింది. ఆమె అలా కూర్చుని పరధ్యానంగా ఆలోచిస్తూంది. ఇంతలో రోడ్డు మలుపు తిరిగి వెంకటం వస్తున్నాడు. ఆమె లేచి క్రిందకి వెళ్ళి దీపం వేసి తలుపు తెరచింది. అతను లాల్చీ విప్పుకుంటూ అడిగాడు. "అన్నయ్య ఏడీ?"

"హాస్పిటలులో ఈ రాత్రి పడుకోవాలట. ఒక స్నేహితుడికి చాలా జబ్బుగా ఉందట."

వెంకటం కొంచెంసేపు ఆలోచిస్తూ నిలబడ్డాడు.

"భోజనానికి లే" అంది శాంత.

"నా భోజనం అయింది. భోజనానికి వచ్చేటట్టయితే వస్తానని చెపుదును".

"పక్క యిక్కడ వేస్తాను"

వెంకటం ఒక క్షణంసేపు తటపటాయించి మెల్లగా కుర్చీలో కూర్చున్నాడు. అతనికి మంచం ప్రక్కహాలులోవేసి ఆమె గదిలోకిపోయి పడుకుంది.

కొంత సేపటికి అవతల దీపం ఆర్పడం. అతను మంచం మీద పడుకోడం ఆమె వింది. కాని ఆమెకు ఎంచేతో నిద్రపట్టలేదు. ఎన్నో విషయాలు ఆమె మనస్సులోకి వచ్చిపోతున్నాయి. జరిగినవీ. జరగవలసినవీ. నిమిషాలూ గంటలూ గడిచిపోతున్నాయి. ఇంతలో అవతల లైటు వెలిగింది. ఆమె గుండెలు గొంతుకలో కొట్టుకొంటున్నాయి. గదిలో దీపం కూడా వెలిగింది. వెంకటం సాధ్యమైనంత వరకూ చప్పుడు చెయ్యకుండా తన పెట్టె తెరచి అందులోనించి కాగితాలూ, పెన్నూ తీసుకున్నాడు. పెట్టె మూత మెల్లగా మూసి లేచి దీపం ఆర్పివేశాడు. ఆమె మెలకువగానే నిద్ర నటిస్తూ ఇదంతా చూసింది. అతను గదిలోనించి అవతలకు వెళుతూ గది తలుపు దగ్గరగా మూస్తున్నాడు.

"ఎవరూ?" ఆమె కంగారుగా లేచి కళ్ళనులుముకుంటూ గుమ్మంలోకి వచ్చింది.

"నేనమ్మా. పెట్టెలో కాగితాలూ, కలమూ తీసుకున్నాను. పెట్టె అసలు ఇవతల పెట్టుకోవలసింది."

"ఫరవాలేదు...... మంచి నీళ్లు కావాలా?"

"ఇందాకటినించీ నిన్ను లేపుదామనుకుంటూనే మొగమాట పడ్డాను. ఒక పెద్ద చెంబుతో ఇయ్యి"

ఆమె వంట ఇంటిలోకి వెళ్ళి ఒక మరచెంబుతో నీళ్ళు తీసుకు వచ్చి కుర్చీ ప్రక్కన పెట్టింది....ఆవులించింది. మొగం పమిట చెంగుతో తుడుచు కుంది. వెంకటం కలం రెండోకొన నోట్లో పెట్టుకొని ఆలోచిస్తున్నాడు. ఆమె అక్కడే నిలబడి ఉండడం చూపి అతను అన్నాడు. "వెళ్ళిపడుకోవమ్మా"

"నిద్ర తేలిపోయింది."

వెంకటం ఆమెను తీక్షణంగా చూసాడు. మంచినీళ్ళు తాగాడు.

"కథ ఒకటి రాద్దామని లేచాను" ఆమె సమాధానం చెప్పలేదు.

"నాకు ఇల్లాంటప్పుడు తప్ప కథలు రాయడం కుదరదు. ఇటువంట ప్పుడు నిశ్శబ్దంగా ఉంటుంది. మనస్సు ఇంక, ఇతర విషయాలమీదికి పోదు"

"నేను కూర్చుంటే కథ రాయడం కుదరదా?"

"నువ్వు కూర్చుంటే కథ—పోనీ, తరవాత రాస్తాను"

"పోనీ, నేను పోయి పడుకుంటాను''

"ఏమయినా ఈవేళ ఇంక కథ రాయలేను"

''ఏం నా మూలాన మనసు చెదిరి పోయిందా'' ఆమె వెంటనే తను అన్న ముక్కలో తెలివితక్కువను గ్రహించింది. చాలా ఖంగారుపడింది. అతను కళ్లు సన్నగా చేసి ఆమెవేపు చూశాడు.

"ఆడవాళ్ళని చూపినంతమాత్రాన నా మనస్సు చెదిరిపోదు." తన్ను కదిపి చూడ్డానికి అతను అలా అన్నాడని ఆమె అనుకుంది. గదిలోకి వెళ్ళి పోవడమా, అక్కడ కూర్చుని కబుర్లు చెప్పడమా, అన్న సందిగ్ధంలో పడింది. ఆమె మనస్సు

''రాద్దామనుకున్న కథ ఈ సాయంకాలం పూర్తయింది. ఇంకా పూర్తి అయిందనడానికి కూడా వీలులేదు. ఆ కంగారునించి నేనింకా తేరుకో లేదు. రేపు రాస్తాను."

"ఆ కథలన్నీ చదివాను."

"అవి నీతిని బోధిస్తాయి. నాకథలన్నీ అంచేత కులస్త్రీలకు రుచించవు"

"అయినా అల్లాంటివి అసలు జరగవు"

" కథల్లో ఒక్క సంఘటనగాని, పాత్రగాని నేను ఎరగనిది లేదు. నేనసలు లేని విషయాన్ని కల్పించలేను."

ఆమె గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఆమె సాహసించి అంది, "అందుల్లో ఒక కథ ఉంది. ఒకఆమె క్రీస్తు మతంలో కలిసిపోయి చివరికి చచ్చిపోతుంది. ఆవిడ ఎవరు?"

"నువ్వని నీ అనుమానం" ఆమె మొఖం పాలిపోయింది. ఆమె అతనివేపు తెల్లబోయి చూస్తూ కూర్చుంది.

"కాని ఆ కథంతా ఒక ప్రత్యేక వ్యక్తిని గురించి కాదు. ఈ సమాజంలో ప్రతి స్త్రీలోనూ ఆ లక్షణాలన్నీ ఉన్నాయి. పెళ్ళి చేసుకుని

కాపురాలు చేస్తున్న స్త్రీలందరికీ అందులో కొన్ని లక్షణాలు పుడతాయి." అతను కొంచెంసేపాగి. "అందుకే నేను పెళ్ళి చేసుకోదలుచుకోలేదు." అన్నాడు.

ఆమె వెటకారంగా అంది. "నీకు తగిన ఆడవాళ్లు ఈ దేశంలో లేనట్టున్నారు."

"కాదు కాదు, నాకు తగిన ఆడవాళ్లు అసలు నన్ను పెళ్లాడరు. పెళ్ళాడినందువల్ల వాళ్ళకీ, నాకు కూడా లాభంలేదు. అంచేత కులాసాగా, స్నేహంగా కాలం గడిపివేస్తాం"

"వాళ్ళంతా పెళ్ళికాని పతివ్రతలనుకుంటాను"

"నిజం వాళ్ళే. వాళ్లల్లో గొప్ప వ్యక్తులున్నారు, వాళ్ళు మనల్ని బాధ పెట్టరు, నేను వాళ్లని బాధ పెట్టను. కాని ఎంత తెలివయిన వాళ్లున్నారు, ఎంత చలాకీ అయినవాళ్ళున్నారు. వాళ్లకి లోకజ్ఞానం ఎంతుందో తెలుసా? ఇట్టే పట్టేస్తారు మనిషిని. వాళ్లతో కులాసాగా మాట్లాడుతుంటేను చాలు........"

"పెళ్ళి చేసుకున్న వాళ్లంతా మూర్ఖులనుకుంటాను"

"కొందరు పెళ్ళి చేసుకు తీరాలి. వాళ్ల శరీరానికి, మనస్సుకీ అది సరిపడుతుంది."

"మనస్సుని ఆపుకోలేని వాళ్ళంతా అవినీతే గొప్పదంటారు. అందులో ఇప్పుడీ కాలంలో ఆ దృష్టి మరీ ఎక్కువయిపోయింది"

"వదినా! నీలాగ చదువుకున్న స్త్రీ ఇంకా సుమతీ శతకంలో మాటలు మాట్లాడుతుందని నేను అనుకోలేదు. మనస్సుని ఆపుకోగలిగితే పెళ్ళిమాత్రం ఎందుకు. మనస్సుని ఆపుకోగలమనుకున్న వాళ్ళని చూస్తే ఎందుకు అసూయ ఆలాలేని వాళ్ళుపడతారు?"

"నీ స్నేహితురాళ్ళను చూసి నేను మాత్రం అసూయపడటంలేదు."

వెంకటం లేచాడు, ఆమె కుర్చీ దగ్గరగా వచ్చాడు. "లేదు నీకున్నది అసలు అసూయ. ఆ కథలో స్త్రీ లక్షణాలలో నీకు చాలాభాగం ఉన్నాయి.

నీకేం కావాలో నీకు తెలియదు. ఏదో బ్రహ్మాండమయినది ఎప్పుడో జరుగు తుందని నీ బోటివాళ్లు అనుక్షణమూ ఎదురు చూస్తుంటారు. కాని ఏమీ జరగదు. రోజులు అలాగ రైలు రోద్దులాగ హెచ్చుతగ్గులు లేకుండా నడిచి పోతాయి హెచ్చుతగ్గులను చూస్తే ఒకమూల మీకు భయం, ఒకమూల కుతూ హలం. అంచేత మీరు సుఖంగా బతకరు. మీ చుట్టుపక్కల ఉన్నవాళ్ళను సుఖంగా బ్రతకనివ్వరు"

ఆమె నిర్ఘాంతపడి కుర్చీలో కూర్చుండిపోయింది. అతను కిటికీ దగ్గరికి వెళ్ళి అవతలకి చూస్తూ అన్నాడు.

"ఈవేళ ఒక కులస్త్రీ నాతో కూడా రైల్లో వచ్చేసింది. జీవితాంతం దాకా నన్ను పట్టుకుని వదలనంటుంది. ఆ బాధ నేనెక్కడ భరించగలను? పెళ్ళి చేసుకున్నవాడెవడో వాడిది ఆ కర్మ. వాడికి టెలిగ్రాం ఇచ్చాను. రేపొచ్చి ఆమెను తీసుకుపోతాడని ఆశిస్తున్నాను. అబ్బ! ఈ కట్టడుల్లో ఉన్న ఆడవాళ్ళు ప్రాణాలు తెంచుతారు. నేను కనిపించే సరికి ఇంక ఇరుగూ పొరుగూ చూచుకోకుండా ప్రారంభిస్తుంది. హోటల్లో అందరూ మాకేసి చూడ్డమే. దేన్నయినా భరించ వచ్చుగాని మదపిచ్చి మాత్రం భరించడం కష్టం"

శాంత లేచింది, నాలుగడుగులు అతనివేపు నడిచింది. అతని వీపుమీద చెయ్యి వెయ్యబోయి ఆపుకుంది. అతను చటుక్కుని వెనక్కి తిరిగాడు. ఆమె కళ్ళు తిరిగాయి. పడిపోకుండా అతను పట్టుకుని మెల్లగా మంచం మీద పడుకోబెట్టాడు. కుర్చీ వెనక్కి ఈడ్చుకొని ముఖం మీద చన్నీళ్లు చల్లాడు. ఆమె తెప్పరిల్లి అతనివేపు చూపి చటుక్కుని వెక్కివెక్కి ఏడవడం మొదలు పెట్టింది. అతను కంగారుపడ్డాడు. నుదుటిమీద నిమిరాడు. ఆమె ఏడుస్తూనే కళ్ళు మూసుకుపడుకుంది.

అతను లాల్చీ తొడుక్కున్నాడు. జోడు తొడుక్కున్నాడు. చప్పుడు విని ఆమె లేచి కూర్చుంది. కళ్ళు తుడుచుకుంది. అతను అన్నాడు.

"నేను అలాతిరిగి తెల్లవారేసరికి వస్తాను. నీకు కాస్త నిద్ర అవసరం"

"ఫరవాలేదు నేను లోపలికి పోయిపడుకుంటాను. నువ్వు రాసుకున్నా సరే. నిద్రపోయినాసరే"

వెంకటం జోడు విప్పకుండానే దగ్గరగా వచ్చి నిలబడి "ఎందుకు నీకలా ఏడుపొచ్చింది?" అన్నాడు.

"ఏమో! నా గర్వం దెబ్బ తిందనుకుంటాను"

"నేను వచ్చీరావడంతోటే నీఅందానికి ముగ్ధుడనయిపోతాననుకున్నావు. నేను వట్టి వ్యభిచారినని విన్నావు. వ్యభిచారులంటే అలాగే ప్రవర్తిస్తారని నీ ఊహ. నేనలా ప్రవర్తించకపోయినందువల్ల.... ...."

"అదికాదు నీ కథలో స్త్రీలాగ అయిపోతానేమోనని భయం వేసింది. ఏదోఒక కానిపని చేస్తే ఆ దెబ్బతో మనస్సు తిరుగుతుందనిపించింది. కాని ...

"కానిపని అనుకున్నాళ్ళూ నువ్వు అలాంటి పని ఏదీచెయ్యలేవు. చెయ్యకూడదుకూడా.... ....నేను వెళిపోతాను. మళ్లీ చాలా రోజుల వరకూ కనిపించను. నీకు అది ఎక్కువ సుఖం. ఈ విషయాన్ని గురించి అట్టే ఆలోచించకు. రేపు ఎవరినన్నా పంపుతాను. స్టేషనుకి సామాను పంపించెయ్యి .. ....ఏదో పనిమీద వెళ్ళిపోయాడని అన్నయ్యతో చెప్పు వాడు వివరాలేమీ అడగడు."

"నువ్వలా వెళ్ళిపోనక్కరలేదు. నేను స్థిమితపడ్డాను."

"నీకు తెలియదు. నేను వెళ్ళిపోవడం మనిద్దరికి కూడా మంచిది."

"నాలో ఏదో ఆకర్షణ నీకు కూడా ఉందన్నమాట"

వెంకటం చిరునవ్వు నవ్వుతూ అన్నాడు: "ఉంది. ఇదొక కథలాగ కూడా రాస్తాను. నిన్ను మాత్రం చాలాకాలం వరకూ మరచిపోలేను. అతకంటే ఇంకేమీ చెప్పను. పోతాను."

అతను వెళిపోతూంటే ఆమె నిట్టూర్చి అంది. "నిన్న సాయంత్రం కథ ఏమయిందో తెలుసుకోవాలని ఉంది."

"కథరాసి నీకు పంపుతాను" అతను వెళ్లిపోయాడు. ఆమె చాలాసేపు తెరచిన గుమ్మంలో నిలబడి చీకట్లో చూసింది.

(భారతి : రజతోత్సవ సంచిక, జనవరి–1949)